
ప్రజాశక్తి
బుధవారం 31 మే 2023 5
శ్రీ సత్యసాయి



విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా..?



చెట్టు మధ్య నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు

పక్షుల మృతి గాలివాన బీభత్సంతో పాటు.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కూడా ఓ కారణం అయ్యి ఉండొచ్చనే వాదన విన్పిస్తోంది. గాలివానకు చెట్లపై ఉన్న పక్షి పిల్లలు కింద పడ్డాయి. వీటిలో ఎక్కువ శాతం వాటికి కాళ్లు,రెక్కలు విరిగాయి. ఒక చెట్టులో మాత్రం కింద పడ్డ అన్ని పక్షి పిల్లలూ మృతి చెందాయి. ఆ చెట్టు కొమ్మల మధ్యన విద్యుత్ తీగలు వెళ్లాయి. దీనికి కొంతదూరంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఈ నేపథ్యంలో పక్షి పిల్లల మతి వెనుక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కూడా ఓ కారణం అయ్యి ఉండొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అనేక పక్షులు ఉంటున్న మహా వక్షంలో విద్యుత్ తీగలు ఉన్నా వాటిని మార్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు ప్రయత్నం చేయలేదు. కనీసం రక్షణ కవచాలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో పక్షుల మరణాలు మరింత పెరిగాయి.



సోమవారం రాత్రి వీచిన గాలివానకు వీరాపురం గ్రామంలో చనిపోయిన సైబీరియన్ పక్షి పిల్లలు, ఇలాంటి వందలాది పక్షి పిల్లలు మృతి చెందిన సమూహాలు పెద్ద సంఖ్యలో ఆ గ్రామంలో ఉన్నాయి...

ప్రతి రోజూ విదేశీ విహంగాలైన సైబీరియన్ పక్షుల కిలకిల రావాలతో శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం వీరాపురం గ్రామం మేల్కొంటోంది. అన్ని గ్రామాల్లో కోడి జనాన్ని నిద్రలేపితే ఇక్కడ మాత్రం ఈ ఎర్రకాళ్ల కొంగలు గ్రామస్తులను లేపుతాయి. ఈ ఊరి అతిథిలా వచ్చే ఈ పక్షులను అక్కడి గ్రామస్తులు ఎంతో ప్రేమతో చూసుకుంటారు. వాటి కిలకిలరావాలను ఎంతో సంతోషంగా వింటూ ఉంటారు. ఇంత సంతోషంగా విహరిస్తున్న ఆ పక్షులు ఒక్కసారిగా ప్రకృతి ప్రకోపానికి గురయ్యాయి. సోమవారం రాత్రి గాలివాన బీభత్సం ధాటికి పక్షుల గూళ్లు నేలవాలాయి. వందలాది పక్షులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘనతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలముకున్నాయి



గూడు చెదిరె... గుండె పగిలె..!

- ◆ వీరాపురంలో సైబీరియన్ పక్షుల హాహాకారాలు
- ◆ 'అతిథు'లపై ప్రకృతి ప్రకోపం
- ◆ గాలివాన బీభత్సానికి పిట్టాల్లా రాలిపోయిన విదేశీ విహంగాలు
- ◆ కాల్లు విరిగి... రెక్కలు చెదిరి.. రక్తపు గాయాలతో మృత్యువాత
- ◆ కుప్పలుగా పక్షుల కళేబరాలు
- ◆ సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం, అధికారులు విఫలం

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు మండలం వీరాపురం పరిసర గ్రామాలకు సైబీరియన్ పక్షులు ప్రతి ఏడాది వస్తుంటాయి ఇక్కడ సంతానోత్పత్తి అనంతరం స్వదేశానికి తిరిగి వెళ్తుంటాయి. అలాంటి అతిథి పక్షులకు కష్టం వచ్చిపడింది. సోమవారం రాత్రి వీచిన గాలివాన దెబ్బకు పక్షుల గూడు చెదిరిపోయింది. నెలల తరబడి గూడు పెట్టుకుని గుడ్లు పొదిగి పిల్లలను పునరుత్పత్తి చేసిన పక్షులు ఒక్కసారిగా ప్రకృతి ప్రకోపానికి గురయ్యాయి. గాలివాన దెబ్బకు వందలాది పక్షులు మృతి చెందాయి. గ్రామం, పరిసర పొలాల్లో ఎక్కడ చూపిన సైబీరియన్ పక్షుల పిల్లల కబేలాలే కన్పిస్తున్నాయి. రెక్కలుతెగి కిందపడిన చిన్న పక్షుల ఆర్థనాదాలు ఆ గ్రామాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. గతంలో ఎన్నడూ చూడని విధంగా కుప్పలు కుప్పలుగా పక్షి పిల్లల కబేలాలు మంగళవారం ఉదయం గ్రామంలో దర్శనమించాయి. వీటిని చూసిన జనం కన్నీటి పర్యంతం అయ్యారు. చెట్ల కింద ముళ్ల కంపల్లో చిక్కుకుని వందలాది పక్షులు మృత్యువాత పడ్డాయి. చెట్లకు వేలాడుతూ మృతి చెందిన పిల్ల పక్షులను చూసి తల్లి పక్షులు మూగరోదన చేశాయి. ఇంతంటి కష్టానికి ప్రకతి విలయం ఎంత కారణమో వీటి రక్షణలో ప్రభుత్వం, సంబందిత శాఖల వైఫల్యం కూడా అంతలా కన్పిస్తోంది.



గూడులో మరణించిన పిల్ల పక్షిని చూస్తున్న తల్లి పక్షి

ఛిద్రమైన 'అతిథి' ప్రయాణం..

సైబీరియన్ పక్షులకు ఓ ప్రత్యేక ఉంది. ఇవి ప్రతి ఏటా ఫిబ్రవరిలో రష్యా నుంచి ఎల్లలు దాటి సంతానోత్పత్తి కోసం చిలమత్తూరు మండలం వీరాపురం, వెంకటాపురం గ్రామాలకు వస్తాయి. ఈ ఎర్రకాళ్ల కొంగలు వాటి సంతానాన్ని ఇక్కడ చేసుకుని మళ్లీ జూలై, ఆగస్టులో పిల్లలతో కలిసి వారి దేశానికి వెళ్లిపోతాయి. ఇది దశాబ్దాల కాలంగా కొనసాగుతోంది. సంతానోత్పత్తికి అనువైన ప్రదేశంగా భావించి వీరాపురానికి వచ్చే ఈ ఎర్రకాళ్ల కొంగలను అతిథి పక్షుల్లా భావించి గ్రామస్తులు ఎంతో ప్రేమగా చూసుకుంటారు. ఐదేళ్ల క్రితం వరకు ఇక్కడ నీరు, ఆహారం వసతి తగ్గడంతో పక్షుల రాక కూడా తగ్గింది. గత రెండేళ్లుగా వర్షాపాతం ఎక్కువ నమోదు కావడంతో పక్షుల సంఖ్య మళ్లీ పెరిగింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ రెండేళ్లలో పక్షులు పెద్ద సంఖ్యలో వీరాపురం గ్రామానికి వచ్చాయి. ఈ ఏడాది వీటి సంఖ్య మరింత పెరిగింది. గ్రామంలో చెట్లన్నీ ఈ పక్షుల గూళ్లతో నిండిపోయాయి. ఇటీవల ఈ పక్షులు గుడ్లు పొదిగి పిల్లల పునరుత్పత్తి జరిగింది.

చెదిరిన పక్షుల గూడు

20 నుంచి నెల రోజుల వయస్సున్న పక్షి పిల్లలు గూళ్లలో ఉన్నాయి. కాగ సోమవారం రాత్రి ఒక్కసారిగా ఈ వీరాపురం పరిసర గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో పక్షుల గూళ్లు చెదిరిపోయాయి. వాటిలో ఉన్న పిల్ల పక్షులు కింద పడి మృతి చెందాయి. మరికొన్ని రక్తగాయాలతో కాళ్లు విరిగి నడవలేని స్థితికి చేరుకున్నాయి. ఎక్కడ చూసినా వందలాది పక్షుల కళేబరాలు కన్పించాయి. ఏ చెట్టు కింద చూసినా కాళ్లు విరిగి కుంటుతున్న పక్షులు... రెక్కలు విరిగి ఎగరలేక ఆగచాట్లు పడుతున్న, మృతి చెందిన పక్షులు కన్పించాయి. ఇక రెండు నెలల్లో పక్షుల సొంత దేశానికి వెళ్ల సమయంలో ప్రకృతి సృష్టించిన విలయ తాండవానికి ఆ పక్షుల జీవన రెక్కలు తెగిపోయాయి. మొత్తంగా ఎన్ని పక్షులు మరణించాయన్న దానిపై అధికారులు ఆ గ్రామంలో పర్యటించి లెక్కలు వేస్తున్నారు.

అధికారుల వైఫల్యమే..?

జిల్లాకు వచ్చే ఈ సైబీరియన్ పక్షులను అతిథుల్లా చూసుకోవడమే కాదు.. వాటి రక్షణను అధికారులు చూసుకోవాల్సి ఉంది. ఎంతో ప్రత్యేకత ఉన్న ఈ పక్షల రక్షణలో సంబంధిత శాఖలు పూర్తిగా వైఫల్యం చెందారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. అతిథి పక్షుల ప్రాణం పోవడానికి పకతి విలయతాండవం ఎంత కారణమో... ప్రభుత్వం, సంబందిత శాఖల వైఫల్యం కూడా అంతే ఉందనే వాదన బలంగా విన్పిస్తోంది. వీరాపురం గ్రామంలో 2016లో కూడా ఇలాగే ఒకసారి జరిగింది. అప్పుడు వందలాది పక్షుల పిల్లలు మత్యువాత పడ్డాయి. కాళ్లూ రెక్కలు విరిగి నరకయాతన పడ్డాయి. ఆ తర్వాత పక్షుల రాక బాగ తగ్గింది. అప్పటి ప్రభుత్వం అధికారులు ఇలాంటి పరిస్థితులు భవిష్యత్తులో రాకూడదని పక్షులకు కత్రిమ గూళ్ల ఏర్పాటు, చెట్ల పెంపకం, ఆహారం అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతామని ప్రగల్బాలు పలికారు. అయితే 6 ఏళ్లుగా చేసింది ఏమీ లేదు. అటు పర్యాటక శాఖ, ఇటు అటవీశాఖ, పశువైద్య శాఖలు మాటలు తప్పా ఆచరణలో సైబీరియన్ పక్షుల సంరక్షణకు తీసుకున్న చర్యలు ఏమీలేవు. పక్షులకు ఏదైనా జరిగినప్పుడు అధికారులు అలా వచ్చి ఇలా వెళ్లిపోతుంటారు.

మరణించినా నిర్లక్ష్యమే...

సోమవారం రాత్రి ప్రకృతి ప్రకోపానికి సైబీరియన్ పక్షుల పిల్లలు వందల్లో మరణించాయి. గ్రామస్తులు పక్షుల కబేళాలను పెద్ద ఎత్తున సామాజిక మాధ్యమాల ద్వారా బయట ప్రపంచానికి తెలియజేశారు. ఇంత పెద్ద ఘటనా జరిగినా కూడా అధికారులు మంగళవారం మధ్యాహ్నం వరకు ఆ గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవు. 'పక్షులే కదా పోతేపోని' అనుకున్నారో ఏమీ ఏ అధికారి కూడా వీటి గురించి పెద్ద పట్టించుకోలేదు. పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉంటే కొన్ని పక్షుల ప్రాణాలైన కాపాడే పరిస్థితి ఉండేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ప్రాంతానికి రెగ్యులర్ పశువైద్యులు లేరు. ఇన్‌ఛార్జులు ఉన్నా వారు స్థానికంగా ఉండరు. ఎప్పుడైన ఇలాంటి ఘటన జరిగితే పరిశీలన చేసినట్లు ఫొటోలు దిగడం వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. మంగళవారం నాడు అదే జరిగింది.



పక్షులను సంరక్షించాలి

సైబీరియన్ పక్షుల సంఖ్యకు అనుగుణంగా వీరాపురం, పరిసర గ్రామాల్లో చెట్లు సరిపోవడం లేదు. రావి, చింత చెట్లు ఉంటే అందులో గూళ్లు ఏర్పాటు చేసుకుంటాయి. అవిలేకపోవడంతో జాలీ, చీమజాలీ వంటి కంపచెట్ల పై గూళ్లు పెట్టి సంతానోత్పత్తి చేసుకుంటున్నాయి. రెక్కలు వచ్చి ఎగిరే సమయంలో ఆ కంపల్లో చిక్కుకొని పక్షులు నరకయాతన పడుతుంటాయి. దీనిపై ప్రభుత్వం, అధికారులు స్పందించి పక్షుల నివాసానికి అనువైన మొక్కలు నాటాలి. ఈ మేరకు అటవీశాఖ అధికారులు చొరవ చూపాలి. ప్రభుత్వం నిధులు కేటాయించి పక్షులను సంరక్షించాలి.

వేణుగోపాల్ రెడ్డి, పక్షుల సంరక్షకుడు, వీరాపురం గ్రామం



కృత్రిమ గూళ్లు ఏర్పాటు చేయాలి

ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగింది. పక్షులను సంరక్షించడానికి వాటిని ఆకర్షించేలాగా కత్రిమ పక్షి గూళ్లు ఏర్పాటు చేయవచ్చు. ఉన్న చెట్లు, ఇళ్ల మిద్దెలపై కత్తిమ గూళ్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇక్కడ మంచి ఆహారాన్నీ పక్షులకు ఇవ్వొచ్చు. ఆ రకంగా ఏర్పాటు చేసి ఉంటే ఈ రోజు వందలాది పక్షిపిల్లలు కిందపడి మతి చెందేవి కాదు. పక్షుల సంరక్షణపై అధికారులు మాటలకే పరిమితం అవుతున్నారు. ప్రభుత్వాల వైపల్యం ప్రతి ఏడాది కన్పిస్తోంది. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వీడి పక్షుల సంరక్షణకు శాశ్వత చర్యలు తీసుకోవాలి.

గిరీశ్ రెడ్డి, వీరాపురం గ్రామస్తుడు.



పక్షులు మృతి బాధాకరం

సైబీరియన్ పక్షులను ఎంతో ప్రేమగా చూసుకుంటాం. మా ఊరికి వచ్చే అతిథులుగా వాటిని గ్రామస్తులు అందరూ భావిస్తారు. అలాంటి పక్షులు గాలివానకు కింద పడి మరణించడం బాధాకరం. వీటి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సోమవారం రాత్రి నుంచి గ్రామస్తులు అంతా దీనిపైనే చర్చించుకుంటున్నారు. రాబోయే కాలంలో ఇలాంటివి పునరావతం కాకుండా సంబంధిత శాఖ అధికారులు పక్షులకు రక్షణ కల్పించాలి. ఇదే విషయాన్ని ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సైబీరియన్ పక్షుల రక్షణను కోరుతాం.

లక్ష్మీపతిరెడ్డి, గ్రామ సర్పంచి.



ఉత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందితో డిఐజి, ఎస్పీ

నేరాల నియంత్రణకు చర్యలు : డిఐజి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


జిల్లాలో నేరాల నియంత్రణకు అన్ని చర్యలూ తీసుకోవాలని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎస్.అమ్మిరెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. సత్యసాయి జిల్లా నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని ఎస్పీ మాధవరెడ్డితో కలిసి మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి స్టేషన్‌లో ప్రతిరోజు విజిబుల్ పోలింగ్ నిర్వహించాలని, స్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులు, విలేజ్ పోలీస్ ఆఫీసర్‌తో కలిసి కాఫీవిత్ ఉమెన్ అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తద్వారా గ్రామాల్లో నెలకొన్న విషయాలపై పూర్తి సమాచారం స్టేషన్ అధికారి దష్టికి వస్తుందని చెప్పారు. జిల్లాలోని రహదారులపై గల బ్లాక్‌స్పాట్లను గుర్తించి ఆయా ప్రదేశాలలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు వాహన తనిఖీలను చేపట్టాలన్నారు. ఫోక్సో కేసుల్లో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. అక్రమ మద్యం, నాటుసారా, గుట్కా, గాంబ్లింగ్, మొదలైన వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సంఘ విద్రోహ చర్యలు పాల్పడే వారిపై కఠినంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు నియంత్రణ జరిగేలా ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సున్నితమైన భాషతో మాట్లాడాలన్నారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మహిళ పోలీసులకు జ్ఞాపికలను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.విష్ణు తో పాటు జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వెలిగిన వీధిదీపాలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

ఎట్టకేలకు పట్టణంలోని పెనుకొండ రహదారిలో దాదాపు రూ.40లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలిగాయి. 70 వీధి దీపాలను పురపాలక సంఘం వారు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్న వాటిని వెలగించలేక పోయారు. దీనిపై ముడుపులు ముట్టలేదు...వీధి దీపాలు వెలగలేదు అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో నాలుగు రోజుల క్రితం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ విచారణ చేసి, సంబందిత గుత్తేదారులతో చర్చించి మంగళవారం రాత్రి విద్యుత్ స్తంబాలకు అమర్చిన వీధి దీపాలను వెలిగించారు.



పెనుకొండ రహదారిలో వెలుగుతన్న వీధి దీపాలు

అచ్చంగా రూ.కోటి మింగేశారు..!

◆ ఉపాధి హామీలో కనగానపల్లిలో భారీగా అవకతవకలు ◆ డ్రై ల్యాండ్ హార్టికల్చర్ పేరుతో నిధులు స్వాహా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉపాధి హామీ పథకంలో అచ్చంగా కోటి రూపాయలకుపైగానే కనగానపల్లి మండలం ఒక్క చోటే ఏడాది కాలంలో మింగేశారు. ప్రధానంగా డ్రైల్యాండు హార్టికల్చర్ పేరుతో ఈ అవకతవకలు జరిగినట్టు సామాజిక తనిఖీల్లోనూ స్పష్టమైంది. సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలంలో ఉపాధి హామీ పథకం అమల్లో పెద్దఎత్తున అవకతవకలు చోటు చేసుకున్నాయి. వైసిపి నాయకులు బాహాటంగా జరిగిన ఘర్షణతో ఈ అవినీతి కాస్త రచ్చకెక్కింది. నాయకులు, ఉపాధి హామీ క్షేత్ర స్థాయి సిబ్బంది కలిసి వ్యవసాయ కూలీలకు దక్కాల్సిన డబ్బులను ఉద్యానవన మొక్కల పెంపకం పేరుతో దోచేశారు. కూలీలు పనిదినాలు సరిపోవడం లేదంటూ ఆందోళనలు చేస్తుంటే, నేతలు, అధికారులు మాత్రం మధ్యలోనే కాజేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.



అచ్చంగా కోటి రూపాయలకుపైగా అవకతవకలు

కనగానపల్లి మండలం పరిధిలో 18 గ్రామ పంచాయతీలున్నాయి. వీటన్నింటి పరిధిలో ఏప్రిల్ ఒకటి 2022 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన పనుల్లో చూసినప్పుడు సుమారు కోటి రూపాయలకుపైగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఒక్క కోనాపురం గ్రామం పరిధిలోనే రూ.30 లక్షల రూపాయలు నిధులను నిబంధనలకు విరుద్ధంగా కాజేశారు. ఇక ఆ తరువాత మద్దెలచెరువు గ్రామ పంచాయతీ పరిధిలో రూ.18.67 లక్షలు ఇదే రకంగా మొక్కల పేరుతో డబ్బులు డ్రా చేశారు. దాదలూరు గ్రామ పంచాయతీ పరిధిలో రూ.17.17 లక్షలు, భానుకోట గ్రామ పంచాయతీ పరిధిలో రూ.8.81 లక్షలు, కొండాపల్లి పరిధిలో రూ.15.99 లక్షలు, భద్రాపురంలో రూ.3.9 లక్షలు, కోనేటిపాలెం రూ.2.26 లక్షలు ,ముక్తాపురం గ్రామం పరిధిలో రూ.8.47 లక్షలదు, మామిళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రూ.2.70 లక్షలు, ముత్తవకుంట గ్రామ పంచాయతీ పరిధిలో రూ.3.33 లక్షలు, తూముచెర్ల పరిధిలో రూ.7.34 లక్షలు ఇవి ప్రధానమైన పనులకు సంబందించి మాత్రమే. ఇక లక్షల్లోపు జరిగిన పనులు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. మొత్తంగా చూసినప్పుడు కోటి రూపాయలకుపైగా అవకతవకలు జరిగాయి. ఇంత పెద్దఎత్తున ఒక్క మండలం పరిధిలో చోటు చేసుకోవడం చర్చనీయాంశమవుతోంది. అవి కూడా ఒక్క ఏడాది కాలంలో జరిగిన అవినీతే ఇది. అంతక మునుపు సంవత్సరాల్లో ఏ మేరకు జరిగిందోనన్నది చూడాల్సి ఉంది. కూలీలకు దక్కాల్సిన డబ్బులను మధ్యలోనే కాజేసి వారి కడుపులు కొడుతుండటం గమనార్హం.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఒకవైపు ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మికులు ఆందోళనలు చేస్తున్నారు. పనిదినాలు సరిపోవడం లేదని అంటున్నారు. మరోవైపు ఈ నిధులను కూలీలకు దక్కకుండా నాయకులు, అధికారులు కలసి కాజేస్తున్నారు. సామాజిక తనిఖీల్లో ఇవి తేలుతున్నా చర్యలుండటం లేదు. మరింత పకడ్బాందీగా కూలీలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

పెద్దన్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు.

'పురం'లో అభివృద్ధి పనులకు మళ్లీ ప్రతిపాదనలు..!

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు రూ. 130కోట్లకు పైగా వివిధ అభివృద్ధి పనుల కోసం ఆమోదం తెలిపారు. అయితే క్షేత్ర స్థాయిలో చూస్తూ కనీసం రూ.30కోట్ల అభివృద్ధి పనులు కూడా పూర్తి కాలేదు. అయిన ప్రతి కౌన్సిల్ సమావేశంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ఆమోదం తెలుపుతున్నారు. అయితే బిల్లులు సకాలంలో మంజూరు కాక పోవడంతో గుత్తేదారులు ఎవరు ముందుకు రావడం లేదు.

మింగు మెతక లేదు... మీసాలకు సంపెంగనూనె కావాలంట అనే సామెత హిందూపురం మున్సిపాల్టీకి అచ్చంగా సరిపోతుంది. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి పట్టణాభివృద్ధికి ప్రత్యేకంగా ఒక్క పైసా నిధులు రాలేదు. మున్సిపాలిటీ ఆదాయం అంతా కలిపినా ఏడాదికి రూ.20 కోట్లలోపే. ప్రతి నెలా మున్సిపాలిటీ తాగునీటి పథకాలకు, వీధి దీపాలకు కలిపి విద్యుత్ ఛార్జీలు దాదాపు కోటి రూపాయలు చెల్లించాలి. పొరుగు సేవల విధానంలో పని చేస్తున్న 300 మందికి పైగా ఉద్యోగులకు రూ.50 లక్షలు వేతనాల రూపంలో చెల్లించాలి. చెత్త తరలింపు వాహనాలతో



పాటు ఇతరత్రా వాహనాలకు డీజిల్, మరమ్మతులు అద్దెలు, మున్సిపాలీటీ, సచివాలయాల నిర్వహణ తదితర వాటి కోసం రూ.50 లక్షలు ఖర్చు అవుతోంది. ప్రతి నెలా రూ. 2 కోట్లు, మున్సిపాలీ ఖాతాలో ఉంటేనే బండి నడుస్తుంది. అయితే అంత ఆదాయం లేకపోవడంతో గొల్లపల్లి, తాగునీటి పథకం విద్యుత్ ఛార్జీలను సకాలంలో చెల్లించలేకపోతున్నారు. దీంతో ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలకు మళ్లించింది. ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.3.5 కోట్లు విద్యుత్ బకాయిల కింద మినహాయించి, మిగిలిన నిధులను మున్సిపాలీటీకి విడుదల చేశారు. మరో వైపున తాగునీటి పథకానికి గుత్తేదారుకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇటీవల ప్రభుత్వం మున్సిపాల్టీ పేరిట రూ.45 కోట్లు అప్పు చేసి, చెల్లించింది. దీనికి సంబంధించి ప్రతి నెల రూ.26 లక్షలు వడ్డీ, రూ.24 లక్షలు అసలు కలిపి ఇఎంఐ రూపంలో రూ.50 లక్షలు చెల్లించాల్సి ఉంది. నిధులు లేకపోవడంతో వడ్డీ మాత్రమే చెల్లిస్తున్నారు. గుత్తేదారుకు ఇంకా రూ.50 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ లో ఉండటంతో 7 ఏళ్ల పాటు నిర్వహణ చూడాల్సి ఉన్నా, అర్ధాంతరంగా తప్పుకొన్నారు. దీంతో నిర్వహణ భారం మున్సిపాల్టీపై పడింది. మరోవైపున పట్టణంలో ఎల్ఇడి వీధి దీపాలు ఏర్పాటు చేసిన గుత్తేదారుకు రూ.12 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. గొల్లపల్లి తాగునీటి పథకం లేని సమయంలో మూడేళ్ల క్రితం వరకు పిఎబిఆర్ నుంచి నీటిని అందించిన గ్రామీణ నీటి సరఫరా విభాగానికి రూ.20 కోట్ల వరకు బకాయిలు అలాగే ఉన్నాయి. ఎల్ఇడిల సరఫరా గుత్తేదారు, గ్రామీణ నీటి సరఫరా విభాగం వారు నోటీసులు మీద నోటీసులు ఇస్తున్నా, ఖజనా సొమ్ము లేక చెల్లింపులు చేయలేకపోతున్నారు. గత మూడేళ్లుగా అభివద్ధి మాట దేవుడెరుగు మున్సిపాలీటీ నిర్వహణ అతి కష్టంగా సాగుతోంది.

రూ.కోట్లలో అభివృద్ధి అంటూ ప్రగల్భాలు జరిగిన పనులు నామమాత్రమే

మున్సిపాల్టీ నిర్వహణ కోసం అధికారులు అష్టకష్టాలు పడుతుంటే, ప్రభుత్వం నుంచి పైసా నిధులు తీసుకురాని పాలకవర్గం మాత్రం, అభివృద్ధి పనుల ప్రతిపాదనల్లో తగ్గడం లేదు. ప్రతి మున్సిపల్ సమావేశంలో కనీసం రూ.6 కోట్లకు పైగా విలువైన పనులను ప్రతిపాదనలను సిద్ధం చేయడం, కౌన్సిల్ ఆమోదం తీసుకోవడం పరిపాటిగా మారింది. పట్టణంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం కోసం రూ.కోట్లకు కోట్లు కేటాయిస్తూ, తీర్మానాలను ఆమోదించారు. అయితే ఆమోదం తెలిపిన పనుల్లో కనీసం 10 శాతం కూడా ప్రారంభం కాలేదు. పూర్తి అయిన పనులకు బిల్లులు చెల్లించ లేదు. దీంతో పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. కాలనీలను సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో రహమత్ పురం, అబాద్ పేట,మేళాపురంల్లో అక్రమణలను తొలగించారు. అయితే అక్కడా పనులు పూర్తి కాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా తాజాగా బుధవారం నిర్వహించే మున్సిపల్ సమావేశంలో కౌన్సిల్ ఆమోదానికి దాదాపు రూ.5 కోట్లకు పైగా విలువైన పనులను ప్రతిపాదించడానికి కౌన్సిల్ ముందు తీసుకు వస్తుండటం గమనార్హం.

ఆరు పథకాలతో రాష్ట్రాభివృద్ధి

మడకశిర : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మహానాడులో 6 పథకాలతో కూడిన మేనిఫెస్టోతో ఆంధ్రప్రదేశ్ పేదరికం లేని రాష్ట్రంగా మారుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా భవిష్యత్తుకు భరోసా పేరుతో ప్రకటించిన ఆరు పథకాలు రాష్ట్రంలోని పేద ప్రజల్లో భరోసాను ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయని అభిప్రాయపడ్డారు. తెలుగుదేశం పార్టీ ఆరు పథకాల మేనిఫెస్టోతో ఈ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు అంతం పలుకుతుందని ఈ సందర్భంగా ఆయన జోస్యం చెప్పారు.


డాక్టర్ శ్రీనివాసమూర్తి

మృతుని కుటుంబానికి పరామర్శ

సోమందేపల్లి : మండల కేంద్రానికి చెందిన నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వడ్డే గోపి నాలుగు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ మృతుని కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ, శ్రీరాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రం భవనం పరిశీలన

రొళ్ల : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ ఆరోగ్య కేంద్ర భవనాన్ని డిసిహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆరోగ్య కేంద్రంలో రోగులకు సరిపడే వసతులను స్థానిక వైద్యురాలు సుజనను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభించడానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు

ధర్మవరం టౌన్ : పౌర్ణమి సందర్భంగా ధర్మవరం ఆర్టీసీ డిపోనుండి కాణిపాకం గోల్డెన్ టెంపుల్, అరుణాచలం గిరి ప్రదర్శనలకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు ధర్మవరం డిపో మేనేజర్ మోతీలాల్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 3న ఉదయం ధర్మవరం డిపో నుండి 6గంటలకు సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సును ఏర్పాటుచేశామని, ఇందులో రానుపోను చార్జీ రూ.1400 మాత్రమే ఉంటుందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుట్టపర్తి అర్బన్ : జేష్ఠ పౌర్ణమి పురస్కరించుకుని జిల్లా నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ప్రజా రవాణా శాఖ జిల్లా అధికారి మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలై లోనిఅరుణాచలం స్వామి దర్శనార్థం, గిరి ప్రదర్శన కొరకు జూన్ 3న జ్యేష్ఠ పౌర్ణమి ని పురస్కరించుకొని ఈ ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. జిల్లాలో హిందూపురం, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ ఆర్టీసీ డిపోల నుంచి ఒక్కో బస్సు నడుపుతున్నామన్నారు. 3న సాయంత్రం ఆయా డిపోలలో సాయంత్రం 6 గంటలకు బస్సులు బయలుదేరి మరుసటి రోజు ఉదయం తిరువన్నామలైకు చేరుకుంటాయన్నారు. తిరుగు ప్రయాణంలో వేలూరులోని గోల్డెన్ టెంపుల్‌ను కూడా చూపించబడుతుందన్నారు. ముందుగానే ఆయా డిపోలలో రిజర్వేషన్లు చేసుకోవచ్చన్నారు. భక్తుల రద్దీని బట్టి అవసరమైతే అదనంగా బస్సులు నడుపుతామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

హుండీ లెక్కింపు

లేపాక్షి : మండల కేంద్రంలోని దుర్గా వీరభద్ర పాపానసేశ్వర స్వామి ఆలయంలో ఉన్న హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 68 రోజులకు గాను రూ. 1.23,459కి వచ్చిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం లో హుండీ పర్యవేక్షణ అధికారి నరసింహారాజులు, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, గ్రామస్తులు రామచంద్రరావు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

హిందూపురం : ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను స్థానిక ఎమ్మెల్సీ నివాసం వద్ద బాధితులకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, సీనియర్ నాయకులు కొండురు వేణుగోపాల్ రెడ్డి, లేపాక్షి మండల కన్వీనర్ నారాయణ స్వామిల చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఐదుగురు లబ్ధిదారులకు రూ.2.66లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోబసిరెడ్డి, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేయాలి

బుక్కపట్నం : నాణ్యమైన సబ్సిడీ విత్తన వేరుశనగను రైతులకు పంపిణీ చేయాలని జిల్లా అగ్రి అడ్వైజర్ చైర్మన్ రమణారెడ్డి, ఎడిఎ సనావుల్లా తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సిద్ధరాంపురం, గూనిపల్లి గ్రామపంచాయతీలో సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కాయల నాణ్యత , తూకాలు, పంపిన విధానాన్ని పరిశీలించి రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి విజయ భాస్కర్ రెడ్డి, వ్యవసాయ అధికారి సతీష్ బాబు, రైతు భరోసాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఏం చేశారని ర్యాలీలు

ధర్మవరం టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి దొంగలముఠా ఏం ఘనకార్యం చేశామని ర్యాలీలు నిర్వహిస్తుందో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకంమధుసూదన్‌రెడ్డి వైసిపి నాయకులను ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వైసీపీ నాయకులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అసలు రాష్ట్రంలో ఏం ఘనకార్యం సాధించారని ర్యాలీలు చేపట్టారో అర్థం కావడం లేదన్నారు.వైసీపీ దొంగ నాటకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేతిరెడ్డి సంస్కారం మరచి ప్రజలను అవమానపరిచే విధంగా మాట్లాడటం ఎంతవరకు సమంజనమని అన్నారు. ధర్మవరంలో చేనేత వ్యవస్థను నాశనమై ఇబ్బందులు పడుతుంటే వారిని ఆదుకోవాలనే కానీ వారినే శపించడం తగదన్నారు. కేతిరెడ్డి నిజాయితీగా బతుకుతున్నట్టు దుర్గమ్మగుడిలోకి, కాణిపాకం వచ్చి ప్రమాణం చేయగలరా అని చిలకం సవాల్ విసిరారు.

పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం

పెనుకొండ : అన్నా క్యాంటిన్ ద్వారా పేదల కడుపు నింపడమే ధ్యేయంగా పనిచేస్తున్నాని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ అన్నారు. పట్టణంలోని సవితమ్మ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్ నిర్వహణ మంగళవారానికి 100 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ ద్వారా ప్రతిరోజు 400 నుంచి 450 మంది వరకు 5 రూపాయలకే రుచికరమైన భోజన సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం సవితమ్మను టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు మాధవ నాయుడు, వెంకటరమణ, శ్రీరాములు, డివి ఆంజనేయులు, వెంకటేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు : సిఐటియు


పెనుకొండలో జెండా ఆవిష్కరణ


పుట్టపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి -పెనుకొండ

కార్మికుల పక్షాన సిఐటియు రాజీ లేని పోరాటాలు చేస్తోందని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయం ముందు సిఐటియు జెండాను సీనియర్ నాయకులు తిప్పన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కార్మిక వర్గ ఐక్యతను సాధించడం కోసం పెట్టుబడిదారీ ప్రభుత్వాల నుండి కార్మిక వర్గాన్ని రక్షించడం కోసం వారి సమస్యల కోసం నిరంతరం సిఐటియు పోరాటాలు చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్న, వజ్రం నాగప్ప, చిన్న వెంకటేష్, వెంకటేష్, రెడ్డప్ప రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : కార్మికుల సమస్యల పరిష్కారం కోసమే సిఐటియు ఆవిర్భవించిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. సిఐటియు 53వ ఆవిర్భావం సందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం సమీపంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పక్షాన నిరంతరం సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు జరుగుతూనే ఉంటాయన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడి ఎన్నో విజయాలు సాధించడం జరిగిందన్నారు. పోరాటాలతోనే కార్మికుల హక్కులు సాధించుకుంటూ వారి సమస్యలు పరిష్కరించుకుంటున్నామన్నారు. సమస్యలు ఉన్నంతవరకు పోరాటాలు జరుగుతూనే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్, మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు నాగార్జున, నర్సింహులు, రామయ్య, పెద్దన్న, గోవిందు, సాయి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల సాధన కోసం సిఐటియు నిరంతరం పోరాటం చేస్తోందని సిఐటియు నాయకులు జగన్మోహన్ పేర్కొన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్ వద్ద స్టాక్ పాయింట్ హమాలీ యూనియన్ అధ్వర్యంలో సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగన్మోహన్, ముస్తక్ అలీ, రామ్మోహన్, ఫైరోజ్, ఆంజనేయులు, సివిల్ సప్లై హమాలి యూనియన్ నాయకులు ఫక్రుద్దీన్, శివ, గంగాద్రి,కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరు ప్రతిఘటించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప పిలుపునిచ్చారు. సిఐటియూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం సిఐటియు పట్టణ అధ్యక్షులు జగదీష్, రామకృష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, ఆనంద్, రామాంజనప్ప, రామచంద్ర, మంజునాథ్, కృష్ణమూర్తి, చంద్ర, నారాయణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న పర్యాటక స్థలాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో కౌన్సిల్ రెండవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రగతిని సమీక్షించారు. తనకల్లు మండలం కోటపల్లి దగ్గర రూ. 149 కోట్లతో ఏర్పాటు చేయనున్న రేస్ కోర్స్ నిర్మాణ పనులపై కలెక్టర్ ఆరా తీశారు. అలాగే పెనుకొండ దగ్గర కుంభకర్ణ, ఎన్‌పి కుంట మండలంలో తిమ్మమ్మ మర్రిమాను, లేపాక్షి జటాయువు, రామగిరి మండలం నసనకోట దుర్గాదేవి దేవాలయం ప్రాంతంలో ఉన్న పర్యాటకశాఖ భవన సముదాయాలను బాడుగలకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కియా పరిశ్రమ వద్దనున్న అతిథి గృహానికి సంబంధించి పెండింగ్ బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రామచంద్ర, జిల్లా అధికారి నాగేశ్వరరెడ్డి, ఎపిఐఐసి ప్రతాప్ రెడ్డి, మేనేజర్ దీపక్, కౌన్సిల్ సభ్యులు సాయిటవర్ పద్మనాభం, మల్లికార్జున, సబ్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి ఆనంద్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌భాషా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్డీఎస్ఎల్ టోర్నమెంట్ విజేత బత్తలపల్లి

ప్రజాశక్తి బత్తలపల్లి

పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో,ధర్మవరం టిడిపి ఇంచార్జ్ పరిటాల పరిటాల శ్రీరామ్ నేతత్వంలో నిర్వహిస్తున్న ఆర్డీఎస్ఎల్ క్రికెట్ టోర్నమెంట్లో ఫైనల్ పోటీలు మంగళవారం జరిగాయి. విజేతకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్ నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. బత్తలపల్లిలో ఈనెల 19 నుండి రోజుకు నాలుగు మ్యాచ్లు చొప్పున క్రీడా పోటీలు నిర్వహించారు. మంగళవారం టోర్నమెంట్లో భాగంగా బత్తలపల్లి క్రికెట్ గ్రౌండ్‌లో గురజాల అప్పస్వామీ ఎలెవన్ (గంటాపురం) ఇర్ఫాన్ టీమ్ (బత్తలపల్లి) జట్ల మధ్య ఫైనల్ పోరు జరిగింది. ఈ పోటీలో ఇర్ఫాన్ టీమ్(బత్తలపల్లి) గెలిచింది. గెలిచిన జట్టుకు గోనుగుంట్ల విజయకుమార్ ట్రోఫీతో పాటుగా రూ,10000 రూపాయలు నగదు బహుమతిని అందజేశారు. అదేవిధంగా రన్నర్ జట్టు గురజాల అప్పస్వామి టీమ్ కు రన్నర్ కప్ అందజేశారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలలో యువత నైపుణ్యాన్ని వెలికితీయడానికి టోర్నమెంట్లు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా పది రోజులపాటు నిర్వహించిన ఆర్‌డిఎస్ఎల్ టోర్నమెంట్‌కు తోడ్పాటునందించిన పలువురిని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఆర్‌డిఎస్ఎల్ మండల ఇన్‌ఛార్జి నెట్టెం రమణ, మండల క్లస్టర్ ఇంచార్జ్ కాకర్ల సురేంద్రనాయుడు, ధర్మవరం నియోజకవర్గం తెలుగు రైతు సంఘం అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు నాయుడు, గోనుగుంట్ల అమర్నాథ్ చౌదరి, జక్కంపూటి నాగభూషణ, కోడేకండ్ల శంకర్, తాళ్లూరి సతీష్ కుమార్ చౌదరి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంతవరకు ఉద్యమం


రిలేదీక్షలో పాల్గొన్న ఉద్యోగులు, నాయకులు

పుట్టపర్తి రూరల్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంతవరకు ఉద్యమం ఆగదని ఎపి జెఎసి అమరావతి శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు మైనుద్దీన్ పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. అందులో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ఎదురుగా మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. జిల్లా అధ్యక్షులతో పాటు కదిరి, బుక్కపట్నం తహశీల్దార్లు, రెవెన్యూ అసోసియేషన్ సెక్రటరీ నరసింహులు, మున్సిపల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహులు, ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగార్జున రెడ్డి, రీజినల్ సివిపి.ఆర్ ఎస్ రెడ్డి, డిపో కార్యదర్శి ముస్తఫా తదితరులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం ఆగదని అన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ బాబా, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చౌడప్ప , విఆర్ఎల సంఘం నాయకులు ఇతర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం : ఉద్యోగుల జీవితాలతో చెలగాట మాడితే ప్రభుత్వానికి పతనం తప్పదని ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. మంగళవారం హిందూపురం తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఎపిజిఇఎ నాయకులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు ఎఐటియుసి నాయకులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్మాయిల్, చలపతి, ఫక్రోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ సెల్వి సాల్మన్ తెలిపారు. పట్టణంలోని ఆసుపత్రిలో మంగళవారం పిసిపిఎల్‌డిటి చట్టంపై డివిజన్ స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధర్మవరం డివిజన్లో 10 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. స్కానింగ్ సెంటర్లపై వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పోలీసు డిపార్ట్మెంట్ల ద్వారా ప్రత్యేక నిఘా ఉంటుందని వివరించారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు జరిపినట్లు తెలిస్తే చట్టరీత్యా తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లను సైతం సీజ్ చేస్తామ్మన్నారు. మెడికల్ స్టోర్స్ లో అబార్షన్ పిల్స్, అబార్షన్ కిట్లు అమ్మకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మలత, వైద్యులు వెంకటేశ్వర్లు, నజీర్, శ్రావణి, వైద్య సిబ్బంది, రోటరీక్లబ్ సభ్యులు, అన్నమయ్య సేవా మండలి సభ్యులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఆయా గ్రామాల రైతులు, గ్రామస్తులు

క్వారీ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి మండల పరిధిలోని చేపట్టిన క్వారీ ఏర్పాటుకు నిరసనగా నిడిమామిడి ,కొట్లపల్లి ,కొత్త నిడిమామిడి గ్రామాల ప్రజలు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇటీవల కొందరు కాంట్రాక్టర్లు 118 సర్వే నెంబర్లలో మూడు క్వారీలను ఏర్పాటు చేయడానికి ప్రజాభిప్రాయ సేకరణకు ఇటీవల ఆర్డీవో ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అయితే గ్రామస్తులు క్వారీ ఏర్పాటుకు నిరాకరించారు. అయితే సంబందిత కాంట్రాక్టర్లు క్వారీ నిర్మాణ పనులు అలాగే కొనసాగిస్తుండగా ఆయా గ్రామాల ప్రజలు సోమవారం స్థానిక కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ క్వారీ నిర్మాణ పనులను వెంటనే ఆపాలని ఆదేశాలు జారీ చేయడంతో పనులను మంగళవారం నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు, ప్రజలు మంగళవారం క్వారీ నిర్మాణ పనులు చేపడుతున్న స్థలం వద్దకు వెళ్లి క్వారీలు వద్దు, ఆరోగ్యమే ముద్దు అని నినాదాలు చేసుకుంటూ నిడిమామిడి కొట్లపల్లి సురగానిపల్లి ,కొత్త నిడిమామిడి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కొంతమంది అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై క్వారీ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారని అలా జరిగితే గ్రామానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోట్లపల్లి, నిడిమామిడి, దండువారి పల్లి, కత్తి వారి పల్లి, సురగానపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఏం చేశారని సంబరాలు..? : టిడిపి

పెనుకొండ : రాష్ట్రంలో నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఏమి అభివృద్ధి చేసిందని సంబరాలు చేసుకుంటున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సవితమ్మ మాట్లాడారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు నరకం అంటే ఏంటో ప్రత్యక్షంగా చూపించారని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. టిడిపి మినీ మేనిఫెస్టోను ప్రకటించడంతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు మాధవ నాయుడు, వెంకటరమణ, శ్రీరాములు, ఆంజనేయులు, వెంకటేష్, కంబాలపల్లి సర్పంచ్ మంజు, త్రివేంద్ర నాయుడు, మాజీ వైస్ సర్పంచి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

ఉచిత కంటి వైద్యశిబిరంతో పేదలకు ఊరట

ధర్మవరం టౌన్ : ఉచిత కంటి వైద్య శిబిరంతో పేదలకు ఊరటనిస్తున్నామని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకె. శ్రీనివాస్, కార్యదర్శి సుకుమార్ తెలిపారు. పట్టణంలోని స్వాతి క్లినిక్‌లో యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు కంటి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో కర్నూలుకు చెందిన శ్రీ చక్ర ఆసుపత్రి వైద్యుల సహకారంతో జూన్4న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని కంటిచూపు తగ్గినవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి రాధాకృష్ణ, క్యాంపు చైర్మన్ జయరాం, సభ్యులు పోలా ప్రభాకర్, చాంద్ బాషా, కుమారస్వామి, కోటేశ్వరరావు, రమేష్ బాబు, బండి నాగేంద్ర, నామాల శ్రీనివాసులు, ఒ.వి. ప్రసాద్, శీలం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

యూజర్ ఛార్జీల వసూలు తప్పనిసరి

హిందూపురం : పురపాలక సంఘ వ్యాప్తంగా ఇంటింటి చెత్త సేకరణకు సంబందించి యూజర్స్ చార్జీలు తప్పని సరిగా వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శానిటేషన్ సెక్రేటరీలకు ఆదేశించారు. మంగళవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో యూజర్స్ చార్జీలపై శానిటేషన్ సెక్రేటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు పురపాలక సంఘ వ్యాప్తంగా 22 వాహనాల్లో ఇంటింటి చెత్త సేకరణ జరుగుతోందని అయితే దీనికి సంబందించి యూజర్స్ చార్జీలు పూర్తి స్థాయిలో వసూలు చేయడం లేదని అన్నారు. ప్రతి వార్డులోను 100శాతం యూజర్స్ చార్జీలను ఆయా సచివాలయ సెక్రేటరీలు వసూలు చేయాలన్నారు. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ నాగేంద్ర, శానిటరి ఇన్స్‌పెక్టర్ నెట్టికల్లు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రజలకు లబ్ధి


మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే



కొత్తచెరువు, పెనుకొండలో బైక్‌ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు సిద్ధారెడ్డి, శంకరనారాయణ

కదిరి టౌన్ : రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలనకు నాలుగు సంవత్సరాలు పూర్తయిందని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాలుగు సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా కదిరి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సిద్ధా రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లమాడ : వైసిపి నాయకులు నల్లమాడ లో మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. వైసిపి ప్రభుత్వం నాలుగేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తమ పార్టీ శ్రేణులతో కలిసి పుట్టపర్తి నియోజకవర్గంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఓడి చెరువు మండలం నుండి మొదలైన ఈ ర్యాలీ నల్లమాడ మీదుగా పుట్టపర్తి వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ కుల్లాయ నాయక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పౌరకల రమణ, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో ప్రజలకు లబ్ధి చేకూరిందని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ అన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలన పూర్తి అయిన సందర్భంగా రూరల్ మండలం కుమ్మర వాండ్లపల్లిలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బత్తల హరిప్రసాద్ మాట్లాడారు. నవరత్నాలతో రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయన్నారు. ఈ సమావేశంలో వైసిపికదిరి టౌన్ అధ్యక్షులు బాహుద్దీన్,లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి, వైస్ఎంపిపి బత్తల ఆదినారాయణ, బిసి నాయకులు సంపంగి గోవర్ధన్, యేసు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు మోసపూరిత హామీలు ఇచ్చారని పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ విమర్శించారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలుగా పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పట్టణంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన అనంతరం బైక్ ర్యాలీ ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాల పథకాలలో ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నామన్నారు. చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయలేదన్నారు. తిరిగి ప్రజలను మోసం చేసేందుకు హామీలు ఇస్తున్నారని ప్రజలు ఇది గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : నాలుగేళ్ల వైసిపి పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ సుపరిపాలన అందించారని పుట్టపర్తి శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలన నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఆమడగూరు మండలంలో ప్రారంభించిన బైక్ ర్యాలీ ఓడిసి, నల్లమాడ, బుక్కపట్నం, కొత్తచెరువు మీదుగా సాయంత్రం ర్యాలీ పుట్టపర్తికి చేరుకుంది. ఈసందర్భంగా హనుమాన్ సర్కిల్ లో పెద్ద కేక్ ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఓబులపతి, వైస్ చైర్మన్లు తిప్పన్న, శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి, పుడా చైర్పర్సన్ లక్ష్మీ నరసమ్మ, జిల్లా అగ్రి సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మెప్మా జిల్లా అధ్యక్షురాలు సాయి లీల, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హిందూపురం : గాంధీ కలలుగన్న స్థానిక పాలనను సచివాలయ వ్యవస్థ రూపంలో తెచ్చి ప్రభుత్వం సర్వీసులను ప్రజల గడప వద్దకు చేర్చిన జగనన్న చరిత్ర సృష్టించారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పేర్కొన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలన సందర్భంగా మంగళవారం ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ నివాసం వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ కేక్ కట్ చేసి సంబంరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండురు వేణుగోపాల్ రెడ్డి,కౌన్సిలర్లు నాగేంద్ర బాబు, నాగేంద్రమ్మ, చిన్నమ్మ, సర్పంచులు, ఆనంద్, కిరీకేరా మూర్తి, అశ్వత్ నారాయణ, బాబే నాయక్, ప్రభాకర్ రెడ్డి, చిలమత్తూరు మండలం కన్వీనర్, ప్రభాకర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, బసిరెడ్డి, రాజారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాలుగు సంవత్సరాల పాలన పూర్తి అయిన సందర్భంగా పుట్టపర్తి ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని మంగళవారం నిర్వహించారు. వైసీపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి, సర్పంచి రాధా నాగరాజు, వైసిపి నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, అశోక రెడ్డి, భాస్కర, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఎస్పీకి ఆత్మీయవీడ్కోలు

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్య సాయి జిల్లా అదనపు ఎస్పీ గా విధులు నిర్వర్తిస్తూ బదిలీ అయిన కెవి రామకృష్ణ ప్రసాద్‌కు జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి అధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు సభను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా అదనపు ఎస్పీ జిల్లాలో విధి నిర్వహణలో తన అనుభవాలను, తోటి సిబ్బంది తో పంచుకున్నారు. అనంతరం అనంతపురం రేంజ్ డీఐజీ శ్రీ అర్ఎన్.అమ్మి రెడ్డి , జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి, నూతన అదనపు ఎస్పీ ఎన్. విష్ణు రామకృష్ణప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లాలోని డీఎస్పీలు, ఎఆర్ సిబ్బంది,సెబ్ సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది, జిల్లా ఎస్‌బి సిబ్బంది, ఇతర అధికారులు రామకృష్ణప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.